క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 6న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం, జెడ్పీ గెస్ట్‌హౌస్, శ్రీకృష్ణ హాస్పిటల్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు, హంటర్ రోడ్డు సిటిజన్ క్లబ్, దుర్గాదేవి కాలనీ, వాసవీ కాలనీ, భద్రకాళి బండ్ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, పరిమళకాలనీ, మైత్రి గర్, పూరిగుట్ట, సప్తగిరి కాలనీ, ఆర్టీసీ కాలనీ, ఫిల్టర్ బెడ్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేత్రాల సేకరణ


సమ్మిరెడ్డి (ఫైల్)

హసన్‌పర్తి: అనారోగ్యంతో మృతి చెందిన భీమారంలోని కేశవ డిగ్రీ కళాశాల డైరెక్టర్ వెల్గెటి సర్వోత్తంరెడ్డి తండ్రి వెల్గెటి సమ్మిరెడ్డి నేత్రాలను సేకరించారు. కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు నేత్రాలు సేకరించినట్లు శరీర, అవయవ దాతల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి తెలిపారు. కాగా, సమ్మిరెడ్డి మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, డీపీఎస్ స్కూల్ చైర్మన్ రాజిరెడ్డి, కార్పొరేటర్ శివకుమార్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సురేందర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంచంద్రారెడ్డి, దేవస్థాన ధర్మకర్త ఆరెల్లి వెంకటస్వామి సందర్శించి నివాళులర్పించారు.

వరద బాధితులకు చేనేత ఉత్పత్తులు అందజేయాలి

దేశాయిపేట: చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి వరద బాధితులకు ప్రభుత్వం అందించాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత సహకార సంఘాల, మాస్టర్ వీవర్స్ దగ్గర ఉన్న చేనేత ఉత్పత్తుల నిల్వలను కొనుగోలు చేసి భారీ వర్షాలకు వరదలతో సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులైన వారికి పంపిణీ చేసి ఆదుకోవాలని కోరారు. నేతన్నలు ఉత్పత్తి చేసిన బెడ్ షీట్స్, శతరంజీలు, లుంగీలు, టవల్స్, వగైరా నిల్వలు పేరుకుపోయి వారు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని కొనుగోలు చేసి వరద బాధితులకు పంపిణీ చేస్తే ఇటు నేతన్నలకు అటు వరద బాధితులకు సహాయం చేసినట్లు ఉంటుందని వివరించారు. నేతన్నలకు త్రిఫ్ట్ ఫండ్ బకాయిలు రూ.90కోట్లు విడుదల చేసినందుకు ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



మడికొండ: కాజీపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన మునిగాల రజినీకాంత్ అనారోగ్య సమస్యతో గత నెల 27వ తేదీన మృతి చెందారు. కాగా, 2002 – 2003వ పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.20వేల ఆర్థిక సాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దాస్, తిరుపతి, అనిల్, సతీష్, వెంకటేష్, సుకుమార్, రామ్, రాజు పాల్గొన్నారు.

నేత్ర, అవయవ దాతలకు సన్మానం



హన్మకొండ: జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల సందర్భంగా నేత్ర, అవయవ దానం చేయడానికి ముందుకొచ్చిన ఆర్టీసీ ఉద్యోగి దంపతులను వరంగల్ రీజనల్ మేనేజర్ డి.విజయభాను సన్మానించారు. హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో అవయవ దానం చేసేందుకు ముందుకు వచ్చిన ఆర్టీసీ ఏడీసీ సలువాది బాబురావు – కళావతి దంపతులను సన్మానించి అభినందించారు. డిప్యూటీ ఆర్ఎంలు భానుకిరణ్, మాధవరావు, వరంగల్ –2 డిపో మేనేజర్ జ్యోత్స్న, నేత్ర, శరీర, అవయవ దాతల అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రతినిధులు అనంతుల కేదారి, దళపతి పాల్గొన్నారు.

డీఈ సాంబరెడ్డికి అవార్డు



హన్మకొండ: ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డివిజనల్ ఇంజనీర్ జి.సాంబరెడ్డి బెస్ట్ పర్ఫామెన్స్ అవార్డు అందుకున్నారు. జూలై మాసంలో సాధించిన ప్రగతికి ఎన్పీడీసీఎల్ యాజమాన్యం బెస్ట్ పర్ఫామెన్స్ అవార్డును ప్రకటించింది. హనుమకొండ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో డీఈ సాంబరెడ్డికి ఇన్‌చార్జ్ డైరెక్టర్ మధుసూదన్, హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ అవార్డు అందించారు. కార్యక్రమంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ నవీన్‌కుమార్, ఏడీ మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

గురువులకు ఘన సన్మానం

సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నగర వ్యాప్తంగా గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గురువులను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్థానికులు ఘనంగా సన్మానించారు.

\- సాక్షి నెట్‌వర్క్


కేయూ విద్యాకళాశాలలో రాధాకృష్ణన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్లు, తదితరులు


శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న స్థానికులు



హసన్‌పర్తిలోని హైస్కూల్‌లో..


మడికొండలోని మండల పరిషత్ పాఠశాలలో..


జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో..


కరీమాబాద్ న్యూ కౌటిల్యాస్ హైస్కూల్‌లో..


ఏనుమాముల పాఠశాలలో..


ఖిలా వరంగల్: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఐవీఎఫ్ జాతీయ నేత గట్టు మహేష్‌బాబు

అజర ఆస్పత్రి యాజమాన్యంపై చర్య తీసుకోవాలి


ధర్నా చేస్తున్న నాయకులు, మృతురాలి బంధువులు

ఎంజీఎం: వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతికి కారణమైన అజర ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) హనుమకొండ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి డిమాండ్ చేశారు. ఈమేరకు నగరంలోని ములుగు రోడ్డులోని అజర ఆస్పత్రి ఎదుట బాధిత మహిళ బంధువులతో కలిసి డీవైఎఫ్ఐ నాయకులు గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులను దోచుకోవడమే లక్ష్యంగా ఆస్పత్రి యాజమాన్యం పనిచేస్తోందని, ప్రజల ప్రాణాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. శాయంపేట మండలం ప్రగతి సింగారం గ్రామానికి చెందిన చిలకల రమ సోమవారం ఆస్పత్రిలో చేరి వైద్యుల నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోయిందని అన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరంజీవి, నాయకులు రాజేందర్, కుమార్, రాజేష్, మహేష్, ప్రశాంత్, ప్రవీణ్, ప్రజా సంఘాల నాయకులు చిలుకల కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

‘హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్’పై అవగాహన


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్, తదితరులు

నయీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం మత్తురహిత సమాజం నిర్మాణం కోసం తీవ్రంగా కృషి చేస్తోందని, అందులో భాగంగా హ్యాబిట్ ఫ్మార్మింగ్ డ్రగ్స్ దుర్వినియోగం కాకుండా ప్రభుత్వం, డ్రగ్స్ కంట్రోలర్ అథారిటీ (డీసీఏ) చేపడుతున్న చర్యలకు హనుమకొండ జిల్లా కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ పూర్తి మద్దతు తెలుపుతోందని అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హ్యాబిట్ ఫ్మార్మింగ్ డ్రగ్స్‌ను క్వాలిఫైడ్ డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌పై మాత్రమే కొనుగోలు చేయాలని, రోగులకు జిల్లా వ్యాప్తంగా ఉన్న కెమిస్ట్‌ల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ ఫ్రీ స్టేట్‌లో భాగస్వామ్యం కావడానికి పూర్తిస్థాయిలో తమ సహకారం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎం.మధుకర్‌రావు, పాకాల శ్రీనివాస్, లక్ష్మణ్, రాజమౌళి, ప్రభాకర్, రాజేందర్ పాల్గొన్నారు.


కాన్సిక్వెన్షియల్ సీనియారిటీ కొనసాగించాలి


నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగులకు కాన్సిక్వెన్షియల్ సీనియారిటీ కొనసాగించాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి దర్శనాల మొగిలయ్య డిమాండ్ చేశారు. కాజీపేట నిట్ సబ్ స్టేషన్ ఎదుట తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మొగిలయ్య మాట్లాడుతూ ఉద్యోగుల పదోన్నతిలో పాత రిజర్వేషన్ పద్ధతిని పాటించాలన్నారు. వివాదాస్పదమైన టీఓఓ 954, ఎస్ఓఓ 37, ఎస్పీఓ 101, టీజీఓఓ 62 ఆర్డర్లను రద్దు చేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధనకు ఈనెల 2 నుంచి 10వ తేదీ వరకు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్నట్లు వివరించారు. 11నుంచి 16వ తేదీ వరకు మధ్యాహ్న భోజన సమయంలో డివిజన్, సర్కిల్ కార్యాలయాల ఎదుట నిరసన తెలపనున్నట్లు వివరించారు. ఈనెల 17న హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట, 20న హైదరాబాద్‌లోని ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ హనుమకొండ టౌన్ డివిజన్ ప్రెసిడెంట్ సందీప్‌కుమార్, సెక్రటరీ రాజ్‌కుమార్, సభ్యులు సురేష్, శివకుమార్, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులనే పూజిద్దాం


విద్యారణ్యపురి: ప్రచారం చేస్తున్న సైకిల్ వాకర్స్


తల్లిదండ్రులకు లేఖలు రాసిన విద్యార్థులు

విద్యారణ్యపురి: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దామని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి అన్నారు. ఈమేరకు హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో కరపత్రాలను గురువారం పంపిణీ చేశారు. ఈమేరకు వాకర్స్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించి మట్టి గణపతుల ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ అనంత్, బాధ్యులు రమేష్, నరసయ్య, వేణుగోపాల్, సత్యనారాయణ, అలీ, భిక్షపతి, జయప్రసాద్, పబ్లిక్ గార్డెన్ వాకర్స్, యోగా సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు విద్యార్థుల ఉత్తరాలు

హసన్‌పర్తి: మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని కోరుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ఉత్తరాలు రాశారు. హసన్‌పర్తి మండలం ఎల్లాపురం శివారులోని ఆర్బిట్ టెక్నో స్కూల్‌లో మట్టి వినాయక విగ్రహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిట్టిరెడ్డి భగవాన్‌రెడ్డి మాట్లాడుతూ రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వాడకంతో వాతావరణం కలుషితమవుతోందని పేర్కొన్నారు. డైరెక్టర్ హారికారెడ్డి, అకడమిక్ ఇన్‌చార్జ్ వాసుదేవారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలుడి వైద్య చికిత్సకు దాతల చేయూత


ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

కాజీపేట: ఇటీవల కోతుల భయానికి భవనంపై నుంచి దూకి తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు కొలిపాక మనోభిరామ్ కుటుంబానికి దక్షిణ మధ్య రైల్వే భారత్ స్కౌట్స్ సభ్యులు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. ఆస్పత్రిలో బాలుడి తల్లిదండ్రులకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ డివిజన్ సభ్యులు రూ.1,21,800లు, అలాగే, నవదీప్త చారిటబల్ ఫౌండేషన్ పక్షాన రూ.20 వేల విలువగల చెక్కు అందించారు. కార్యక్రమంలో పొన్నాల సురేష్ బాబు, డానియల్, రాజేష్, పిఎస్.రావు, మంజులవాణి, ఎం.ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో పనులు పూర్తి చేయండి



నయీంనగర్: నయీంనగర్ బ్రిడ్జి తుది దశ పనులను శుక్రవారంతో పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. గురువారం నయీంనగర్ బ్రిడ్జి తుది దశ పనులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ఈనెల 9న సీఎం రేవంత్‌రెడ్డి బ్రిడ్జిని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెస్తారని, పెండింగ్‌లో ఉన్న ఫర్నిషింగ్ పనులతో పాటు సుందరీకరణ పనుల్ని పూర్తి చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చాడ స్వాతి, ఎస్ఈ రాజయ్య, హెచ్ఓ రమేష్, ఏఈ సరిత తదితరులు పాల్గొన్నారు.

జైలు అధికారికి సన్మానం



వరంగల్: గురుపూజోత్సవం సందర్భంగా వరంగల్ జిల్లా సబ్ జైళ్ల అధికారి విజయడేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విజయడేకు గురువారం పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జైలర్ గొట్టె రామకృష్ణ, గోపిరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రమ, మజారుద్దీన్, మక్బూల్, వార్డర్ రంగన్న, రాజు, జైల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలి

ఖిలా వరంగల్: పిల్లలను అంగన్‌వాడీ సెంటర్లలో చేర్పించాలని కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ సూచించారు. పోషక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా ఖిలా వరంగల్ తూర్పుకోటలోని కొత్తగడ్డ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తీగల కల్యాణి ఆధ్వర్యంలో పోషక మాసోత్సవాన్ని గురువారం నిర్వహించారు. అలాగే, తూర్పుకోట హనుమాన్ జంక్షన్‌లో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అందజేసిన మట్టి గణపతి విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేశారు. మార్కెట్ మాజీ డైరెక్టర్ సంగరబోయిన చందర్, బోగి సురేష్, కర్ణాకర్, దూడయ్య, కేశవ్, అర్షం రాంబాబు పాల్గొన్నారు.

అధికారులను కలిసిన రేషన్ డీలర్లు

హన్మకొండ అర్బన్: రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు ఆధ్వర్యంలో రేషన్ డీలర్ల సంఘం నాయకులు, జిల్లాలోని అన్ని మండలాల రేషన్ డీలర్లు గురువారం హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీసీఎస్ఓ పి.వసంతలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలతో కూడిన వినతి పత్రాలను వారికి అందజేశారు. అనంతరం బత్తుల రమేష్‌బాబు మాట్లాడుతూ రేషన్ షాప్‌ల ద్వారా ప్రభుత్వం ఈనెల గోధుమలు, చక్కెర పంపిణీ చేసేందుకు నిర్ణయించగా సిటీలో 2కిలోలు, మండల కేంద్రంలో కిలో చొప్పున జిల్లాలో కేవలం ఆరు మండలాలకు మాత్రమే విడుదల చేసినట్లు తెలిపారు. 5 కిలోల చొప్పున జిల్లాలోని 7 మండలాలకు ఒకేసారి, మరోనెల 7 మండలాలకు కేటాయించేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం నాయకులు, రేషన్ డీలర్లు మహేశ్వరం, గౌరీశంకర్, మహేష్, తోట సమ్మయ్య, సాంబయ్య, తిరుపతి, శ్రీనివాస్, దేవేందర్, రాజేష్, సమ్మయ్య, రవీందర్, చందు, సతీష్, ప్రతాపరెడ్డి, ప్రభాకర్, రామరాజు, రాజేందర్, మల్లన్న, సర్వేశం, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

హన్మకొండ అర్బన్: రేషన్ డీలర్ల సమస్యల పరిష్కరించాలని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు, రేషన్ డీలర్ల సంఘం నాయకులు, జిల్లాలోని రేషన్ డీలర్లు కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు.

మఠం పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

కాజీపేట: లంబాడీలకు ఆరాధ్య దైవం అయిన హాథిరాంజీ బాబా మఠం పరిరక్షణకు రెండు తెలుగు రాష్ట్రాల పాలకులు తగిన చర్యలు చేపట్టి లంబాడీ బిడ్డల మనోభావాలను కాపాడాలని మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ విజ్ఞప్తి చేశారు. కాజీపేట 61వ డివిజన్ తెలంగాణ సర్కిల్‌లోని తన స్వగృహంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2005లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు బంజారాలను ట్రస్ బోర్డు చైర్మన్‌గా, సభ్యులుగా నియమించాలంటూ జారీ చేసిన ఉత్తర్వులను విలేకరులకు అందజేశారు. ట్రస్ట్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరుతూ త్వరలో కమిటీ చైర్మన్‌గా సభ్యులతో కలిసి వెళ్లి ఇద్దరు సీఎంలకు వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. బానోతు సాంబయ్య, వీఎస్.నాయక్, వీరమ్మ, వెంకట్ నాయక్, అజ్మీర వెంకట్, రాజునాయక్, కేయూ రాజు, డాక్టర్ చందు నాయక్, జవహర్‌లాల్ నాయక్, ప్రేమ్ నాయక్, బానోతు వెంకన్న, నర్సింహనాయక్, లావుడ్య శంకర్ నాయక్ పాల్గొన్నారు.

శ్వేతార్క ఆలయంలో పెద్దపట్నంతో పూజలు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో పెద్దపట్నంతో గురువారం ఒగ్గు కళాకారులు స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి దేవస్థాన ఒగ్గు పూజారులు సింగారపు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఒగ్గు కళాకారులు రంగురంగులతో శ్వేతార్కుడి ఎదుట పెద్దపట్నం వేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ, బ్రహ్మశ్రీ త్రిగుళ్ల శ్రీనివాస్ శర్మ, ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, తుమ్మ శ్రీనివాస్, దేవులపల్లి సదానందం తదితరులు పాల్గొన్నారు.

గందరగోళానికి గురిచేస్తున్న వారిని నమ్మకండి

హన్మకొండ అర్బన్: ఉద్యోగ జీవితంలో, సామాజిక బాధ్యతలో తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీకి సరిపోని స్వయం ప్రకటిత జేఏసీ సంఘాలు కొన్ని టీజీజేఏసీకి పోటీగా పనిచేస్తున్నట్లు నటిస్తూ ఉద్యోగులను తీవ్ర గందరగోళానికి గురిచేస్తున్న వాటిని ఉద్యోగులు నమ్మవద్దని హనుమకొండ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ అధ్యక్షులు ఆకుల రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర, జిల్లా, తాలుకా కమిటీలు, డిపార్ట్‌మెంట్ ఫోరం, ఉద్యోగులతో ఎలాంటి సంబంధాలు, ఉద్యోగుల సమస్యలపై అవగాహన లేని వాళ్లు కొంతమంది స్వయం ప్రకటిత జేఏసీల పేరుతో సోషల్ మీడియా, పత్రిక ప్రకటనకు మాత్రమే పరిమితమై ఉద్యోగులను గందరగోళానికి గురి చేస్తున్నారని పేర్కొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ

హసన్‌పర్తి: అర్హులైన రైతులందరికీ రుణ మాఫీ వర్తింపజేస్తామని వ్యవసాయశాఖ జాయింట్ సెక్రటరీ ఉదయ్‌కుమార్ అన్నారు. తమకు రుణమాఫీ వర్తించలేదని పెగడపల్లి, కావుల కానిపర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సభ్యులు, సంఘం చైర్మన్లు చల్లా గోపాల్‌రెడ్డి, సంపత్ కోరారు. ఈమేరకు రుణమాఫీ అయ్యేలా చూడాలని హైదరాబాద్‌లో ఉదయ్‌కుమార్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్ట్ కుటుంబాన్ని ఆదుకోవాలి

నయీంనగర్: ఇటీవల అకాల మరణం చెందిన జర్నలిస్ట్ యోగి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు కోరారు. ఈమేరకు యోగి భార్య స్వప్నకు రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యావంతురాలైన యోగి భార్యకు ఉద్యోగం ఇప్పించడానికి జిల్లాకు చెందిన అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

జూడో క్రీడాకారులకు అండగా సామాజిక వేత్త

కాశిబుగ్గ: తమిళనాడు వెళ్లి రావడానికి వరంగల్ ఖేలో ఇండియా సెంటర్ జూడో క్రీడాకారులకు నగరానికి చెందిన సామాజికవేత్త ఎల్.శ్రీనివాస్ రైల్వే టిక్కెట్లు అందజేసి అండగా నిలిచారు. ఓసిటీలోని జిల్లా యువజన క్రీడల కార్యాలయంలో క్రీడాకారులకు టికెట్లను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎస్ఓ సత్యవాణి మాట్లాడుతూ జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 9నుంచి 12వ తేదీ వరకు చెన్నై పీరియమెంట్ జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో 4వ ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్, సబ్ జూనియర్, సీనియర్ సౌత్ జోన్ టోర్నమెంట్స్ జరుగుతున్నాయని, వాటిలో పాల్గొనడానికి వరంగల్ ఖేలో ఇండియా సెంటర్ నుంచి 10 మంది సబ్ జూనియర్ క్రీడాకారులు (బాలికలు) వెళ్తున్నారని చెప్పారు. వారికి రానుపోను రైల్వే టిక్కెట్లను శ్రీనివాస్ తన సొంత ఖర్చులతో కొని అందజేశారని వివరించారు.

రైల్వే సంఘ్ జోనల్ సభ్యుడిగా రాజ్‌కుమార్

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ లోకోరన్నింగ్ బ్రాంచ్ వర్కింగ్ అధ్యక్షుడు పాక రాజ్‌కుమార్‌ను రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ దక్షిణ మధ్య రైల్వే జోనల్ యూత్ కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నారు. ఈ మేరకు సంఘ్ జోనల్ జాయింట్ జనరల్ సెక్రటరీ భరణిభానుప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

మగ్దూంపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

వరంగల్ అర్బన్: ఆదివాసీ మహిళా మోర్చా నీలాబాయిపై అత్యాచారం చేసి ఆపై హత్య చేసేందుకు యత్నించిన మగ్దూంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో కేసులు నమోదు చేసి ఉరిశిక్ష విధించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ చౌరస్తాలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు శిల్ప ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా మార్గం అనుసరణీయం


కాజీపేట: మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాయిని


హసన్‌పర్తి: నివాళులర్పిస్తున్న కాలనీవాసులు

కాజీపేట: పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలపై మదర్ థెరిస్సా చూపిన ప్రేమ, ఆప్యాయతలను ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. మదర్ థెరిస్సా 27వ వర్ధంతిని పురస్కరించుకుని కాజీపేట 61వ డివిజన్ ఫాతిమానగర్ జంక్షన్‌లో ఆమె విగ్రహానికి కథోలిక గురువులతో కలిసి ఎమ్మెల్యే గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కథోలిక మేత్రాసనం పీఠాధిపతి బిషప్ డాక్టర్ ఉడుమల బాల, కెథడ్రల్ చర్చి విచారణ గురువు కాసు మర్రెడ్డి, లోడి డైరెక్టర్ ఫాదర్ ఎస్.ఇన్నారెడ్డి, ఆర్.రాజ్‌మోహన్‌రావు, బొక్క దయసాగర్, కూరపాటి వెంకటనారాయణ పాల్గొన్నారు.

మదర్ థెరిస్సాకు నివాళి

హసన్‌పర్తి: నోబెల్ బహుమతి గ్రహీత మదర్ థెరిస్సా వర్ధంతిని హసన్‌పర్తి మండలం ముచ్చర్ల గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్‌థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానికులు సీహెచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేష్, రమేష్, శ్రవణ్, కుమార్‌రెడ్డి, వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం..


నిత్యావసర సరుకులు అందజేస్తున్న మురళీధర్

కాశిబుగ్గ: ఎవరూ అధైర్యపడొద్దని అండగా ఉంటారని మైసయ్య నగర్ ముంపు బాధితులకు మాజీ ఎమెల్సీ కొండా మురళీధర్‌రావు భరోసా కల్పించారు. వరద బాధితులకు బియ్యంతోపాటు 16 రకాల నిత్యావసర వస్తువులను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో 35వ డివిజన్ కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్, ఎండీ.అయాబ్, గోపాల నవీన్ రాజు, మీసాల ప్రకాష్, రేణుకుంట్ల శివకుమార్, శ్రీరాం రాజేష్, కొత్తపల్లి శ్రీను తదితరులు ఉన్నారు.

పేదలకు బాసటగా ఉంటాం..

ఖిలా వరంగల్: వరద బాధితులకు బాసటగా ఉంటామని కొండా మురళీధర్‌రావు హామీ ఇచ్చారు. ఇటీవల వర్షాలకు ముంపునకు గురైన ఎస్ఎస్‌నగర్, డీకే నగర్, మైసయ్యనగర్ ముంపు ప్రాంతాల్లో తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వరద బాధితులను కలిసి నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు.

దేవాదాయ శాఖతోనే ఆలయాల అభివృద్ధి

కాశిబుగ్గ: రాష్ట్ర దేవాదాయ శాఖతోనే ఆలయాలు అభివృద్ధి చెందుతాయని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అన్నారు. ఈమేరకు ఆ రెండు ఆలయాలను గురువారం సందర్శించి పూజలు చేశారు.

దుస్సకుంటలో ఆక్రమణలను తొలగించాలి

కాశిబుగ్గ: కాశిబుగ్గ దుస్సకుంటలో సర్వే చేసి ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకోవాలని అధికారులకు మురళీధర్‌రావు సూచించారు.

ఎన్‌సీసీతో భారత సైన్యంలో ఉద్యోగావకాశాలు


దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

రామన్నపేట: ఎన్‌సీసీ సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేస్తే విద్యార్థులకు భారత సైన్యంలో ఉద్యోగావకాశాల పొందేందుకు గొప్ప అవకాశం ఉంటుందని ఎల్‌బీ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్‌రావు తెలిపారు. నగరంలోని ములుగు రోడ్డులోని లాల్ బహదూర్ కళాశాల క్రీడా మైదానంలో కళాశాల ఎన్‌సీసీ ఆర్మీ తెలంగాణ పదవ బెటాలియన్‌లో 2024 – 2025లో ప్రవేశాలకు కళాశాల విద్యార్థులకు గురువారం ఎంపికలు జరిగాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్‌సీసీ సీ, బీ సర్టిఫికెట్లతో ఆర్మీలోని త్రివిధ దళాలు, కేంద్ర పారామీటర్, సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్ అగ్నివీర్ వంటి వాటిల్లో ప్రత్యేక రిజర్వేషన్లు ఉంటాయని వివరించారు. ఆర్మీలో నేరుగా రాత పరీక్ష లేకుండానే ఉద్యోగాలు ఉంటాయని తెలిపారు. ఎంపిక ప్రక్రియ సెలక్షన్లు బెటాలియన్ అధికారి, జూనియర్ కమిషనర్ ఆఫీసర్ పీఎస్ సౌరస్య, కార కెప్టెన్ డాక్టర్ సదానందం పర్యవేక్షణలో జరిగినట్లు తెలిపారు. ఎన్‌సీసీ క్యాడెట్లు దీపక్ వాగు, విజయ్ బి దాదర్, రాజ్‌కుమార్, సంతోషి, సృజన, రాము పాల్గొన్నారు.

‘అంబేడ్కర్ ఓపెన్’లో డిగ్రీ అడ్మిషన్ల గడువు పెంపు

దేశాయిపేట: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2024 –25వ విద్యా సంవత్సరానికి డిగ్రీ అడ్మిషన్ల గడువు పొడిగించినట్లు వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ కళాశాల అభ్యాసకుల సహాయ కేంద్రం కోఆర్డినేటర్ ఎస్.అనిల్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్‌రావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 30వ తేదీ లోపు www.braouonline.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని అడ్మిషన్ పొందాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 7382929618 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.